# ఎమ్మెల్యేలను కలిసిన బీఆర్‌ఎస్ నాయకులు

గజ్వేల్ అర్బన్, డిసెంబర్ 16 : మాజీ మంత్రి హరీశ్‌రావు, మాజీ ఎంపీ కొత్త ప్రభాకర్ రెడ్డిని గజ్వేల్ బీఆర్‌ఎస్ నాయకులు శనివారం మర్యాదపూర్వంగా కలిశారు. సిద్దిపేట ఎమ్మెల్యేగా ఏడోసారి గెలిచిన మాజీ మంత్రి హరీశ్ రావు, దుబ్బాక ఎమ్మెల్యేగా గెలిచిన మాజీ ఎంపీ కొత్త ప్రభాకర్‌రెడ్డిని కలిసి పుష్పగుచ్ఛాలు అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. కలిసినవారిలో బీఆర్‌ఎస్ సీనియర్ నాయకులు కల్యాణ్‌కర్ నర్సింగరావు, అమరేందర్‌రావు, మల్లేశం, సుధాకర్, ప్రవీణ్ తదితరులు ఉన్నారు.



మంత్రి హరీశ్‌రావుకు పుష్పగుచ్ఛం అందజేస్తున్న సీనియర్ నాయకుడు నర్సింగరావు తదితరులు



దుబ్బాక ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డికి శుభాకాంక్షలు తెలుపుతున్న గజ్వేల్ బీఆర్‌ఎస్ నాయకులు

## స్నేహితుల చేయూత

హుస్నాబాద్ టౌన్, డిసెంబర్ 16 : చిన్ననాటి స్నేహితుడి కూతురి వివాహానికి స్నేహితులు ఆర్థిక సాయం అందించి అండగా నిలిచారు. హుస్నాబాద్‌కు చెందిన 1983–84కు చెందిన పదో తరగతి బ్యాచ్‌కు చెందిన మార్కండూయ శ్రీనివాస్ కూతురి వివాహం శనివారం జరిగింది. ఈ సందర్భంగా శ్రీనివాస్ కూతురి వివాహానికి చిన్ననాటి స్నేహితులు హాజరై లక్షా పదహారు వేల రూపాయలు అందజేశారు. కార్యక్రమంలో కరీంనగర్ ఎంపీడీవో సంపత్, స్నేహితులు అశోక్, శ్రీనివాస్, వెం కటేశ్వర్‌రావు, శ్రీనివాస్, రాజిరెడ్డి, ఆర్‌బీ చారి, రాజేశ్, కిషోర్, ప్రకాశ్ ఉన్నారు.

## మద్యం కేసులో శిక్ష ఖరారు

వర్గల్, డిసెంబర్ 16 : డ్రంకెన్ డ్రైవ్ కేసులో ఓ వ్యక్తికి రెండు రోజులపాటు జైలు శిక్ష పడిన ఘటన మండలంలోని మైలారంలో చోటు చేసుకుంది. గౌరారం ఎస్సై విజయ్‌భాస్కర్ వివరాల ప్రకారం.. మైలారం గ్రామానికి చెందిన ఉప్పరి స్వామి తండ్రి నర్సయ్య ఇటీవల మద్యం తాగి బైక్ నడుపుతుండగా గౌరారం పోలీసులకు పట్టుబడ్డాడు. శనివారం గజ్వేల్ కోర్టులో న్యాయమూర్తి విచారణ జరిపి బాధితుడికి రెండు రోజులపాటు జైలు శిక్ష విధించినట్లు ఎస్సై తెలిపారు.

## చేపల వేటకు వెళ్లి వ్యక్తి మృతి

మిరుదొడ్డి, డిసెంబర్ 16 : చేపల వేటకు వెళ్లి వ్యక్తి మృతి చెందిన ఘటన మిరుదొడ్డి మండలం కాసులాబాద్ గ్రామంలో చోటు చేసుకుంది. మిరుదొడ్డి ఎస్సై నరేశ్ వివరాల ప్రకారం.. కాసులాబాద్‌కు చెందిన బుడగ జంగం పర్వతం నర్సిహులు(42) గ్రామ శివారులోని వావిలాకుంటలో శనివారం చేపల వేటకు వెళ్లాడు. చేపలు పట్టే క్రమంలో ప్రమాదవశాత్తు నీటిలో మునిగి మృతి చెందాడు. మృతుడి భార్య మల్లవ్వ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

## అకౌంట్ నుంచి నగదు మాయం

బెజ్జంకి, డిసెంబర్ 16 : మండల కేంద్రానికి చెందిన ఓ యువతి అకౌంట్ నుంచి రూ.90 వేల నగదు మాయమైన ఘటన శనివారం చోటు చేసుకుంది. వివరాల్లో వెళ్తే.. యువతి సెల్‌ఫోన్ నంబర్‌కు మీకు కొరియర్ ఆడర్ వచ్చిందని సైబర్ నేరగాడు చెప్పాడు. లేదు.. మేము ఏ ఆడర్ చెయ్యలేదని యువతి చెప్పింది. మీ ఆడర్‌ను రద్దు చేయుటకు రూ.5 డిజిటల్ చెల్లింపు చేయాలని యువతిని సైబర్ నేరగాడు అడిగాడు. యువతి వెంటనే చెల్లింపు చేసింది. దీంతో అకౌంట్ నుంచి రూ.90 వేలు మాయం అయ్యాయి. సైబర్‌దాడిలో నగదు పోయినట్లు యువతి గుర్తించి వెంటనే పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేపట్టారు.

## బాడీ ఫ్రీజర్ అందజేత

చేర్యాల, డిసెంబర్ 16 : లయన్స్ క్లబ్ ఆఫ్ చేర్యాల ఆధ్వర్యంలో కమిటీ ప్రతినిధులు రూ.60 వేల విలువైన బాడీ ఫ్రీజర్‌ను చేర్యాల మున్సిపాలిటీకి శనివారం అందజేశారు. ఈ సందర్భంగా లయన్స్ క్లబ్ అధ్యక్షుడు పెద్ది తిరుపతిరెడ్డి మాట్లాడుతూ డాక్టర్ దీపాంజలి తండ్రి జ్ఞాపకార్థం బాడీ ఫ్రీజర్ అందజేసినట్లు తెలిపారు.

# నర్సరీల్లో మొక్కల సంఖ్య పెంచాలి



నర్సరీని సందర్శిస్తున్న చైర్‌పర్సన్ రజితావెంకన్న

హుస్నాబాద్ టౌన్, డిసెంబర్ 16 : నర్సరీల్లో మొక్కల సంఖ్యను మరింత పెంచాలని మున్సిపల్ చైర్‌పర్సన్ ఆకుల రజితావెంకన్న అన్నారు. శనివారం పట్టణ శివారులోని నర్సరీని ఆమె సందర్శించారు. ఈ సందర్భంగా నర్సరీలో ఎన్నిరకాల మొక్కలు పెంచుతున్నారనే విషయాన్ని అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా చైర్‌పర్సన్ మాట్లాడుతూ నర్సరీలో ప్రస్తుతం ఉన్న మొక్కలతోపాటు మరిన్ని మొక్కలు పెంచేందుకు కృషిచేయాలన్నారు. ప్రతి నర్సరీలో నిండుగా మొక్కలు ఉండేందుకు చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. ఆమె వెంట ఏఈ సాయిప్రణిత్, ఇంజినీర్ రవికుమార్ ఉన్నారు.

## నామమాత్రంగా ప్రజాదర్బార్

మిరుదొడ్డి, డిసెంబర్ 16 : మహాత్మాగాంధీ జాతీయ ఉపాధి హామీ పథకంలో సామాజిక తనిఖీల పేరుతో అధికారులు నామమాత్రంగా సమావేశం నిర్వహించి చేతులు దులుపుకుంటున్నారని ఎంపీపీ గజ్జల సాయిలు అన్నారు. శనివారం మిరుదొడ్డిలో ఉపాధి హామీ పథకంలో ఆయా గ్రామాల్లో ఎన్‌ఆర్‌ఈజీఎస్ అధికారులు 13వ విడత ప్రజా దర్బార్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ మండలంలోని అభివృద్ధి కార్యక్రమాలకు సర్పంచులు, ఎంపీటీసీలకు అధికారులు ఎందుకు సమాచారం ఇవ్వలేదని ప్రశ్నించారు. ప్రభుత్వం మంజూరు చేసిన ఎన్‌ఆర్‌ఈజీఎస్ నిధులను ప్రజలకు ఉపయోగపడే విధంగా పనులు చేయాలన్నారు. అధికారుల తీరును నిరసిస్తూ ఎంపీపీ సమావేశం నుంచి వెళ్లిపోయారు. కార్యక్రమంలో పీడీ జయదేవ్ ఆర్య, ఏపీడీలు ఓబులేశ్, బాల్‌రాజు, జిల్లా విజిలెన్స్ అధికారి ప్రభాకర్, ఎండీ ఆరీఫ్, ఎంపీడీవో రాజిరెడ్డి, అధికారులు పాల్గొన్నారు.




మిరుదొడ్డి సామాజిక తనిఖీ కార్యక్రమం నుంచి వెళ్లిపోతున్న ఎంపీపీ గజ్జల సాయిలు

# విద్యార్థులు ఉన్నత స్థానాల్లో స్థిరపడాలి

హుస్నాబాద్, డిసెంబర్ 16 : విద్యార్థులు క్రమశిక్షణతో చదివి ఉన్నత స్థానాల్లో స్థిరపడాలని ఎస్సై తోట మహేశ్ అన్నారు. శనివారం హుస్నాబాద్‌లోని నవభారత్ హైస్కూల్‌లో షీటీమ్ ఆధ్వర్యంలో ర్యాగింగ్, ఈవ్‌టీజింగ్, మానవ అక్రమ రవాణా నిర్మూలనపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్సై మాట్లాడుతూ విద్యార్థులు లక్ష్య సాధనకు నిరంతరం కృషి చేయాలన్నారు. ఇతర విద్యార్థులకు హాని చేసే విధంగా ర్యాగింగ్, ఈవ్‌టీజింగ్‌కు పాల్పడొద్దని, ఎక్కడైనా ఇలాంటి ఘటనలు జరిగితే వెంటనే షీటీమ్‌కు లేదా పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయాలన్నారు. సైబర్ నేరాలతో అప్రమత్తంగా ఉండాలని, అపరిచిత వ్యక్తులు చెప్పిన మాటలు నమ్మొద్దన్నారు. మహిళలు, యువతులు, విద్యార్థినుల కోసం అనేక చట్టాలు ఉన్నాయని, వాటిని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో పాఠశాల కరస్పాండెంట్ రవి, డైరెక్టర్ శ్రీనివాస్, షీటీమ్ ప్రతినిధులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## దుర్గామాత విగ్రహ ప్రతిష్ఠాపనోత్సవం

చేర్యాల, డిసెంబర్ 16 : పట్టణంలో నూతనంగా నిర్మించిన దుర్గామాత ఆలయంలో శనివారం అమ్మవారి విగ్రహ ప్రతిష్ఠాపనోత్సవాన్ని భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. మూడు రోజులుగా ఆలయంలో అమ్మవారి విగ్రహ ప్రతిష్ఠానోత్సవాలు కొనసాగుతున్నాయి. ఉత్సవాల్లో భాగంగా శనివారం దుర్గామాత విగ్రహ ప్రతిష్ఠాపన, దృష్టికుంభం, అర్చన, పుర్ణాహుతి, మహాదాశీర్వచనం, రుత్విక్ సన్మానం, మహా అన్నదానం, పుట్ట బంగారం, ఘటం కుండ, బోనాల సమర్పణ తదితర కార్యక్రమాలు నిర్వహించారు. ఆదివారం దుర్గామాత అమ్మవారి కల్యాణోత్సవం వైభవంగా జరుగనుంది. పురోహితులు దేశపతి రామచంద్రమూర్తి, మరుమాముల రామచంద్రమూర్తి వైదిక నిర్వహణలో ఉత్సవాలు ఘనంగా జరిగాయి.



దుర్గామాత ఆలయం వద్ద భక్తుల సందడి

## నేటి నుంచి ధనుర్మాస ఉత్సవాలు

### ఉత్సవాలకు సిద్ధమైన వేంకటేశ్వరాలయం

సిద్దిపేట టౌన్, డిసెంబర్ 16 : చంద్రమానంలోని మార్గశిర మాసంలో సూర్యుడు ధనుర్రాశిలోకి ప్రవేశించడంతో ధనుర్మాసం ప్రారంభమవుతుంది. ఈ మహా విష్ణువుకు ప్రీతిపాత్రమైన మాసం ఇది. ఈ మాసంలో చేసే వ్రతాలు, పూజలు, పుణ్యకార్యాలు తప్పకుండా ఫలప్రదం అవుతాయని వేదపండితుల మాట. ఈ మాసం ఆరంభం నుంచి సంక్రాంతి పండుగ వరకు ఉత్సవాలు వేడుకగా జరుగుతాయి. ముఖ్యంగా వైష్ణవాలయాల్లో దివ్య ప్రభంధమైన తిరుప్పావై గానంతో స్వామిని కొలవడం, మేలుకొల్పడం ఆనవాయితీగా వస్తుంది. అంతటి విశేషమైన మాసాన్ని వైభవంగా జరిపేందుకు సిద్దిపేట మోహినిపుర వేంకటేశ్వరాలయం ముస్తాబైంది. ఈ ఆలయంలో ఈనెల 17 నుంచి జనవరి 16 వరకు ధనుర్మాస ఉత్సవాలు జరుగనున్నాయి. ప్రతిరోజూ తెల్లవారుజామున తిరుప్పావై గానంతోపాటు ప్రత్యేక పూజలు చేసి సాయంత్రం ఉత్సవాలను ఘనంగా నిర్వహిస్తారు. ధనుర్మాసంలో ప్రత్యేకంగా వ్రతాలను ఆచరిస్తారు. ఆ వ్రతాన్నే ధనుర్మాస వ్రతంగా కొలుస్తారు. ఈ ఆలయాన్ని ఉత్సవాలకు సిద్ధం చేశారు.

## అభివృద్ధి పనులు పూర్తిచేయాలి

సిద్దిపేట అర్బన్, డిసెంబర్ 16 : మండలంలోని అభివృద్ధి పనులు సకాలంలో పూర్తిచేయాలని ఎంపీపీ వంగ సవితాప్రవీణ్‌రెడ్డి అధికారులకు సూచించారు. శనివారం మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ గ్రామాల అభివృద్ధికి అందరూ కృషి చేయాలన్నారు. సమావేశంలో ఇన్‌చార్జి ఎంపీడీవో శ్రీనివాసరావు, సర్పంచులు, ఎంపీటీసీలు, అధికారులు పాల్గొన్నారు.

## సింగిల్ యూజ్డ్ ప్లాస్టిక్ వాడితే చర్యలు

సిద్దిపేట, డిసెంబర్ 16 : సింగిల్ యూజ్డ్ ప్లాస్టిక్‌పై కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నిషేధం విధించినందున సిద్దిపేట పురపాలక సంఘం పరిధిలో ప్లాస్టిక్‌ను వాడితే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని మున్సిపల్ కమిషనర్ సంపత్‌కుమార్ శనివారం ప్రకటనలో పేర్కొన్నారు. ఇటీవల సిద్దిపేట పట్టణ పరిసరాల్లోని ఖాళీ ప్రదేశాల్లో చెత్త వేయడం, ప్లాస్టిక్ కవర్లను పారవేస్తున్నారని తెలిపారు. ప్లాస్టిక్ అమ్మినా.. అక్రమంగా నిల్వ చేసినా చట్టపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు. ఆరుబయట చెత్త వేస్తే వారికి జరిమానా విధిస్తామన్నారు. ప్లాస్టిక్‌పై స్పెషల్ డ్రైవ్ నిర్వహించేందుకు టీమ్‌లు ఏర్పాటు చేశామని తెలిపారు.

## జిల్లా నూతన కమిటీ ఎన్నిక

సిద్దిపేట అర్బన్, డిసెంబర్ 16 : మహాజన సోషలిస్ట్ పార్టీ జిల్లా నూతన కమిటీని ఎన్నుకున్నట్లు ఎంఎస్‌పీ జిల్లా ఇన్‌చార్జి మల్లిగారి యాదగిరి శనివారం తెలిపారు. ఎంఎస్‌పీ జిల్లా నూతన కమిటీ అధ్యక్షుడిగా పెర్క పరశురామ్, ప్రధాన కార్యదర్శిగా సానవల ప్రసాద్, అధికార ప్రతినిధిగా చంచు రమేశ్, ఉపాధ్యక్షులుగా జెర్రిపోతుల లక్ష్మణ్, సుందరగిరి భాస్కర్, కార్యదర్శిగా కొలిమి మల్లేశం, కోశాధికారిగా మాతంగి జితేందర్, సహాయ కార్యదర్శిగా కందికట్ల రాజును ఎన్నుకున్నట్లు వారు తెలిపారు. కార్యక్రమంలో ఎంఈఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చేబర్తి యాదగిరి, ఎంఎంఎస్ రాష్ట్ర అధ్యక్షురాలు జేపీ లత, ఎంఎస్‌ఎఫ్ జిల్లా అధ్యక్షుడు ప్రకాశ్ పాల్గొన్నారు.

## జిల్లా అధ్యక్షుడిగా రామచంద్రయ్య నియామకం

మిరుదొడ్డి, డిసెంబర్ 16 : తెలంగాణ ఎస్సీ, ఎస్టీ గెజిటెడ్ అధ్యాపకుల సంఘం జిల్లా అధ్యక్షుడిగా గొల్లురి రామచంద్రయ్య (మిరుదొడ్డి–జూనియర్ కళాశాల)ను సంఘం రాష్ట్ర అధ్యక్షుడు బరిగెల నారాయణ, రాష్ట్ర కార్యదర్శి గొంటి రవి శనివారం నియమించారు. ఈ సందర్భంగా రామచంద్రయ్య మాట్లాడుతూ సంఘం అభివృద్ధికి తనవంతు కృషి చేస్తానని తెలిపారు.

## ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడిగా కృష్ణమాదిగ

గజ్వేల్ అర్బన్, డిసెంబర్ 16 : ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపకుడు మంద కృష్ణ మాదిగ ఆదేశాల మేరకు జిల్లా ఇన్‌చార్జి మల్లిగారి యాదగిరి ఆధ్వర్యంలో శనివారం జిల్లా నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. ఎమ్మార్పీఎస్ జిల్లా నూతన అధ్యక్షుడిగా ముంద్రాతి కృష్ణ మాదిగ, ప్రధాన కార్యదర్శి ముక్కపల్లి రాజు, కార్యదర్శి బింగి పవన్‌కల్యాణ్, ఉపాధ్యక్షులు కొల్గూరి అశోక్, కార్యవర్గ సభ్యులుగా శ్రీనివాస్, మహేశ్, ఆంజనేయులు, డప్పు రాజు, కరుణాకర్, నర్సింహులు, స్వామి, రమేశ్ ఎన్నికయ్యారు.

## పార్టీ బలోపేతానికి కృషిచేయాలి

మిరుదొడ్డి, డిసెంబర్ 16 : పార్టీ బలోపేతానికి కార్యకర్తలు సైనికుల్లా పని చేయాలని దుబ్బాక మాజీ ఎమ్మెల్యే రఘునందన్‌రావు సూచించారు. శనివారం అక్బర్‌పేట–భూంపల్లి మండలం భూంపల్లి గ్రామంలో బీజేపీ ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. ఈ సందర్భంగా రఘునందన్‌రావు మాట్లాడుతూ ఎన్నికల్లో గెలుపోటములు సహజమని, కార్యకర్తలు ఎవరూ అధైర్య పడొద్దన్నారు. కార్యక్రమంలో బీజేపీ సీనియర్ నాయకులు బాలేశ్ గౌడ్, మద్దెల రోశయ్య, మండల అధ్యక్షుడు కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

## 'మల్లన్న' ఆలయంలో సీల్డ్ టెండర్లు

చేర్యాల, డిసెంబర్ 16 : కొమురవెల్లి మల్లికార్జునస్వామి ఆలయంలో ఈనెల 19న వివిధ అంశాలకు సంబంధించి టెండర్లు నిర్వహిస్తున్నట్లు ఆలయ ఈవో బాలాజీ తెలిపారు. శనివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ పట్నాల బట్ట, ఓం నమ: శివాయ శెల్లాలు, జరీ శెల్లాలు, జాకీటు పీసులు తదితర వాటిని ఆలయానికి సరఫరా చేసేందుకు టెండర్లు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. మల్లికార్జునస్వామి దేవస్థానం కొమురవెల్లి పేరిట చెల్లుబాటు అయ్యేవిధంగా జాతీయ బ్యాంకులో డీడీ తీసి షెడ్యూల్‌కు జతపరిచి బాక్స్‌లో వేయాలన్నారు. టెం డర్లు వేసేందుకు షెడ్యూల్ కావాలనుకునే వారు ఈనెల 17 వరకు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఈనెల 18న షెడ్యూల్ జారీ చేస్తామని తెలిపారు.

**పత్రికా ప్రటకన**

ఇందు మూలంగా సమస్త ప్రజలకు ఈ పత్రిక ప్రకటన ద్వారా తెలియజేయునది ఏమనగా నాక్లయింటు అయిన కంసాని కోమురయ్య తండ్రి శంకరయ్య, గ్రామం: కొడకండ్ల, మండలం: గజ్వేల్ జిల్లా: సిద్దిపేట గారికి కోడకండ్ల గ్రామ శివారులోని సర్వేనెం.18/1ఎ2లో రక్బా ఎ 0–17 గుంటలు మరియు సర్వేనెం. 18/1ఎ3 లో రక్బా ఎ0–07 గుంటలు మరియు సర్వేనెం. 18/1ఎ5లో రక్బా ఎ 0–0750 గుంటలు, మొత్తం రక్బా ఎ0–3150 గుంటల భూమి కలదు. అట్టి భూమి పై అడిషనల్ జూనియర్ సివిల్ జడ్జి, గజ్వేల్ కోర్టులో పార్టీషన్ దావా వేయడం జరిగినది. అట్టి దావా ఓ.యస్.నెం. 346/2023, ఐ.ఏ.నెం.611/2023 గల కేసు విచారణలో కలదు. అట్టి భూమి హద్దులు: తూర్పు: 100 ఫీట్ల పి.డబ్ల్యు రోడ్డు, పడమర: నాగలి యాదయ్య గారి భూమి ఉత్తరం: ఎన్.రాములు గౌడ్ గారి భూమి, దక్షిణం: అనురాగ రెడ్డి గారి భూమి కలదు. ఇట్టి భూమిని నాక్లయింటు కంసాని కొమురయ్య గారికి రావాలసిన వాటా భూమిని కంసాని జమున గారు నాక్లయింటుకు తెలియకుండా అమ్మే ప్రయత్నాలు చేయుచున్నారని తెలిసినది. అట్టి భూమి పై సివిల్ కేసు గజ్వేల్ కోర్టులో విచారణలో కలదు. కావున ఎవరు అట్టి భూములను నాక్లయింటు అనుమతి లేకుండా ఎవరు ఖరీదు చేయరాదు. ఖరీదు చేసినా వారికి ఏలాంటి హక్కు సంక్రమించదు మరియు నష్టపోతారని ఈ పత్రికా ప్రకటన చేయుచున్నాను.

ఇట్లు: Sd/- వి.యం. నరేష్
అడ్వకేట్, సిరిసిల్ల. సెల్: 9949009587